క్లుప్తంగా

నేడు ఆలపాకంలో జగనన్న సురక్ష

విజయపురం: మండలంలోని ఆలపాకం గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉదయం జరుగుతుందని ఎంపీడీఓ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామస్థాయిలో రెవెన్యూకు సంబంధించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని తెలిపారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని బాలాజీ కాలనీలో వెలసిన శ్రీషిర్డీ సాయినాథుని ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాయిబాబా ఆలయంలో ఉదయం 9.30 గంటలకు సామూహిక, సద్గురు షిర్డీసాయి వ్రతం చేపడతామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అదేవిధంగా 6వ తేదీ గురువారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటలకు వరకు భక్తుల స్వహస్తాలతో స్వామివారికి పాలాభిషేకం నిర్వహిస్తామన్నారు. అలాగే ఆలయంలో చేపట్టే సామూహిక వ్రతంలో పాల్గొనే భక్తులు రూ.300 చెల్లించి తమ పేరు, గోత్రం నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేడు మండల మీట్

కార్వేటినగరం: సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ లత ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి సంబంధించిన నివేదికతో అధికారులు మండలమీట్‌కు హాజరు కావాలన్నారు.

పుత్తూరు అమ్మాయికి ఈసెట్‌లో స్టేట్ 9వ ర్యాంక్


టి.భానుప్రియ

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని ఎస్టీఓ కాలనీకి చెందిన టి.భానుప్రియ ఏపీఈసెట్‌లో స్టేట్ 9వ ర్యాంకు సాధించింది. 200 మార్కులకు గాను 97 మార్కులు సాధించి సత్తా చాటింది. చిత్తూరు శ్రీవేంకటేశ్వర నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఫార్మసీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి భానుప్రియ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. తమ కుమార్తె స్టేట్ 9వ ర్యాంకు సాధించడంపై విద్యార్థి తల్లిదండ్రులు టి.హరినాథ్, టి.చంద్ర సంతోషం వ్యక్తం చేశారు.

సాగుకు భరోసా.. అన్నదాత కులాసా


శ్రీకావేరిరాజుపురంలో వేరుశనగ సాగు వేస్తున్న రైతులు

పాలసముద్రం : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఇటీవల అడపాదడపా చినుకులు పడడంతో మండలంలోని పలు గ్రామాల్లో శని, ఆదివారం అన్నదాతలు వేరుశనగ సాగు చేశారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో రైతు భరోసా నగదు, సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలు ఇవ్వడంతో పంట సాగు చేస్తున్నారు. రెండు రోజుల కిందట మండలంలో ఓ మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలకు ఆశలు చిగురించాయి. మండలంలో సాగు విస్తీర్ణం 970 హెక్టార్లు ఉండగా 589 హెక్టార్లలో వేరుశనగ సాగు అవుతోంది. మండలవ్యాప్తంగా మొత్తం 3,274 మంది రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద నాలుగో విడతలో సుమారు రూ.19 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే.

ఐకమత్యంతో ముందుకు నడుద్దాం


జిల్లా, మండల కమిటీతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

నగరి : ఐక్యమత్యంతో అందరూ ఏకతాటిపై నడిస్తే అభివృద్ధి సాధ్యమని ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్‌రాజ్ అన్నారు. ఆదివారం పీసీఏ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థానిక ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొన్నారు. జిల్లా జాయింట్ సెక్రటరీ కెఏ కుమార్, కమిటీ సభ్యులు విక్టర్ వారిని దుశ్శాలువలతో సత్కరించి ఆహ్వానించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులంతా ఐకమత్యంతో ఒక్క తాటిపై నిలబడితే తప్పక అభివృద్ధి పథంలో నడపవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బీసీ హరీష్, జిల్లా సెక్రటరీ కె.సుభాష్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌సీ ఆనంద్‌కుమార్, ఇంద్రయ్య, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అప్పటికప్పుడే సమస్యల పరిష్కారం

రూపాయి ఖర్చు పెట్టలేదు... కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగలేదు. సంక్షేమ పథకాల వర్తింపు, కావలసిన సర్టిఫికెట్లు ఇంటి వద్దకే వచ్చి పైసా ఖర్చులేకుండా వలంటీర్లు అందిస్తున్నారు. నాకు కులధ్రువీకరణ పత్రం వచ్చిందని ఓ విద్యార్థి సంతోషం వ్యక్తం చేస్తుంటే, నాకు రేషన్ కార్డు వచ్చిందని ఓ గృహిణి ఆనందపడుతోంది. బర్త్ సర్టిఫికెట్ వచ్చిందని చిన్నారి, పాసుపుస్తకం ఇచ్చారంటూ రైతు సంతృప్తి పడుతున్నారు. ఏమిటీ రూపాయి చెల్లించకుండా ఇన్ని రకాల సదుపాయాలు ఇంటి వద్ద అందుతున్నాయా ? అని ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఇవన్నీ నిజమే..

- నభూతో నభవిష్యత్ అనేలా జగనన్న సురక్ష క్యాంపులు
- అక్కడికక్కడే సంక్షేమ, ధ్రువీకరణ పత్రాల అందజేత
- పైసా ఖర్చు లేకుండా సంక్షేమాల వర్తింపు, సర్టిఫికెట్ల జారీ
- ఇంతకుముందు ఎన్నడూ ఇలాంటి పాలన చూడలేదంటున్న జనం
- సీఎం జగనన్న పాలనకు జై కొడుతున్న జనం


నగరి నియోజక వర్గంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న భారీ జనసందోహం

నగరి : రాష్ట్రప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అవసరాలు తీరుస్తున్న సువర్ణ పాలనను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. జగనన్న సురక్ష పథకలో భాగంగా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నారు. దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో అందజేస్తే, అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నారు. వారు కోరిన సర్టిఫికెట్లను అందిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, దాన్ని తుచ తప్పకుండా అమలు చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజాకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయ ధ్రువీకరణ పత్రం అందింది



నాపేరు రామక్క, ఎం.కొత్తూరు గ్రామం, నగరి మండలం, నాకు ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరమైన సమయంలో జగనన్న సురక్ష సర్వే అంటూ వలంటీర్ ఇంటి వద్దకు వచ్చారు. నా అవసరాన్ని తెలియజేశా. వారు అడిగిన పత్రాలు ఇచ్చాను. ఎలాంటి ఖర్చు లేకుండా జగనన్న సురక్ష క్యాంపులో నాకు ఆదాయ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఇలాంటి ఒక పథకం రచించిన ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు.

సులభంగా సమస్యల పరిష్కారం



నాపేరు రాణియమ్మ, అగరం పేట, నింద్ర మండలం, వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. ఆపై జగనన్న సురక్ష క్యాంపులో ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్ చేసుకున్నాను. ఆదాయ, కులధ్రువీకరణ పత్రం తీసుకున్నాను. ఇంత సులభంగా ఇన్ని పనులు చేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న సాయం మరువలేనిది. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

పైసా ఖర్చులేకుండా..



నా పేరు కంచి వెంకటేశులు, ఎం.కొత్తూరు గ్రామం, నగరి మండలం. నేడు డిగ్రీ చదువుతున్నాను. జగనన్న సురక్ష సర్వేలో నాకు కులధ్రువీకరణ పత్రం అవసరమని వలంటీర్‌కు తెలియజేశాను. వారు అడిగిన డాక్యుమెంట్లు అందించా. పైసా ఖర్చులేకుండా నేను ఉన్న చోటే నాకు కులధ్రువీకరణ పత్రం అందింది. ఈ ప్రభుత్వానికి నిజంగా హ్యాట్సాఫ్.

ఒక్కరోజులోనే పత్రాలు..



నా పేరు పుష్పలత, ఊరు కాకవేడు ఆది ఆంధ్రవాడ, నగరి మున్సిపాలిటీ. ఇప్పటికే ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చాలా లబ్ధి పొందాను. ప్రస్తుతం ఒక్క రోజులో నాకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇంతలా మేలు చేస్తున్న సీఎం జగనన్నకు, మంత్రి రోజమ్మకు ఎప్పుడూ వెన్నంటి నిలుస్తాం.

పేదలకు మంచి జరుగుతోంది



నాపేరు యువరాజ్, కట్టకింద రామకృష్ణాపురం, పుత్తూరు మున్సిపాలిటీ. గతంలో కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలంటే ఎన్నో ఇబ్బంది పడేవాళ్లం. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడం వల్ల ఒక్క గంటలో కులధ్రువీకరణ పత్రం అందింది. గతంలో ఇలాంటివి ఎప్పుడూ జరగలేదు. ముఖ్యమంత్రి జగనన్న వచ్చాకే మాలాంటి పేదలకు ఎన్నో మంచి పనులు జరుగుతున్నాయి. మళ్లీ రాష్ట్రాన్ని ఆయనే పాలించాలని కోరుకుంటున్నా.

త్వరగా అందించారు..



నా పేరు జ్ఞానేశ్వరి, పాదిరేడు గ్రామం, వడమాలపేట మండలం. నేను ఆదాయ, కులధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు అత్యంత త్వరగా ఎలాంటి ఖర్చులేకుండా సర్టిఫికెట్లు అందించారు. ఈ జగనన్న సురక్ష బృహత్తర పథకం.

జగనన్నకు రుణపడి ఉంటాం ..



నా పేరు రవితేజ, వనదుర్గాపురం ఆదిఆంధ్రవాడ. మా అమ్మ కూలీ. ఆ కూలి డబ్బులతోనే నన్ను డిగ్రీ చదివిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో కుల, ఆదాయం, నివాస సర్టిఫికెట్లు కోసం మీసేవా కేంద్రాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడ్డా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక, మా గ్రామంలోనే స చివాలయం ఏర్పాటు చేసి ఇక్కడే అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు జగనన్న సురక్ష క్యాంపుల్లో కూడా 11 రకాల సర్టిఫికెట్లను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి ఇస్తున్నారు. ఇ లా ప్రజలు, విద్యార్థుల కష్టాలు తెలుసుకుని పరిపాలన చేస్తున్న జగనన్నకు మేము ఎల్లప్పుడు రుణపడి ఉంటాం.

పేదలకు వరం..



నా పేరు గీత, పల్లూరు, పుత్తూరు మున్సిపాలిటీ 1వ వార్డు. నాకు చాలా రోజులుగా బియ్యంకార్డు ఇబ్బందులు ఉండేవి. కార్డు విభజన కోసం ఎన్నో రోజులు వేచి చూడాల్సి వచ్చింది. ప్రస్తుతం జగనన్న సురక్ష ద్వారా నాకు రేషన్ కార్డు సులభంగా అందించారు. ఈ జగనన్న సురక్ష కార్యక్రమం నిజంగా పేదలకు ఓ వరం.

విజయా డెయిరీ ప్రారంభోత్సవానికి విచ్చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పాలసముద్రంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


- సీఎం జగనన్న చేతుల మీదుగా చిత్తూరు విజయా డెయిరీ పునఃప్రారంభం రేపు
- సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధుల పిలుపు

శ్రీరంగరాజపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 4న జిల్లాకు రానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో తన సొంత సంస్థ అయిన హెరిటేజ్‌ను అభివృద్ధి పరుచుకునేందుకు, దేశంలోనే రెండో అతిపెద్ద పాల ఫ్యాక్టరీగా పేరొందిన చిత్తూరు విజయా డెయిరీని ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఆర్థిక నష్టాలకు గురి చేసి, చివరికి రైతులకు కూడా బకాయిలు చెల్లించలేని స్థితికి తీసుకువచ్చి 2002 ఆగస్టు 31న ఎలాంటి నోటీసు ఇవ్వకుండా అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు మూతవేయించి రైతులకు తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. అయితే ప్రజాసంకల్ప యాత్రలో పాదయాత్రగా ఇక్కడికి విచ్చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాడు స్థానిక పాడిరైతులు విజయా డెయిరీని పునః ప్రారంభించాలని విన్నవించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే విజయా డెయిరీని పునఃప్రారంభిస్తామని పాడి రైతులకు ఇచ్చిన హామీని సీఎం జగనన్న నెరవేరుస్తున్నారని అన్నారు. ఈ నెల 4న జిల్లాకే తలమానికమైన, పాడి రైతులు తమకు జీవనాడిగా భావించే విజయా డెయిరీకి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలానికి 30 బస్సులు కేటాయించడం జరిగిందని ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు. సమావేశంలో మండల కన్వీనర్ మణి, సచివాలయ కన్వీనర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, నాయకులు జనార్దన్, కుప్పయ్య, బాబు, రామచంద్రయాదవ్, మహేష్, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమానికి భూమిపూజ వేస్తున్న నేపథ్యంలో కార్యక్రమానికి విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసియాదవ్ తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసియాదవ్, అన్బళగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరుకు రానున్న తరుణంలో మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు భాస్కర్‌రెడ్డి, అయ్యప్ప, అనురేఖ, జీవిత, నరసింహరాజు, సుందరరాజు, ఇందిరమ్మ, చంద్రశేఖర్‌రాజు, సుబ్రమణ్యంరెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, ఎంపీటీసీ గోవిందరాజు, లిఖిత, నాయకులు సుబ్రమణ్యరాజు, పయణి, రవి, సుబ్రమణ్యం, గోపి, వేణు, చిన్నబ్బరాజు, శరవణన్, సుధాకర్, అరుల్, సుమన్, లోకిదాస్, ఆనందన్, చిన్నపయ్యరెడ్డి, చంద్రన్, ఆనందన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం


కార్వేటినగరంలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు


తరలి వచ్చిన భక్తజనం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

- ముగిసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు
- అగ్నిగుండ ప్రవేశాన్ని తిలకించడానికి భారీగా విచ్చేసిన భక్తులు

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అమ్మవారి అగ్నిగుండం ప్రవేశంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు కర్పూర హారతులు పట్టారు. అదేవిధంగా మహిళలు అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కంకణాలు ధరించిన భక్తులు కుమారగిరి సమీపంలో ఉన్న స్కంధపుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన పవిత్ర గంగా జలంతో స్నానం ఆచరించారు. అనంతరం పసుపు వస్త్రాలు ధరించి చేతిలో వేపాకులు పట్టి అమ్మవారితో పాటు ఊరేగింపుగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్దకు చేరుకున్నారు. తరువాత అమ్మవారికి అర్చకులు అగ్గితో వడిబాల కట్టి అమ్మవారి విగ్రహంతో అగ్నిగుండంలో ప్రవేశించగా భక్తులు కూడా ఆమెతో పాటే అగ్నిగుండంలో దిగారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణలు కిటకిటలాడాయి. అగ్నిగుండ ప్రవేశానికి బలిజ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉప కోశాధికారి కృష్ణయాదవ్, భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ దస్తగిరి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

టీడీపీ నేతలవి జీవం లేని ఆరోపణలు

- కళ్లున్న కబోదులు.. టీడీపీ నాయకులు
- టీడీపీ నాయకులపై మున్సిపల్ చైర్మన్ హరి ఫైర్


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: పుత్తూరులో అభివృద్ధి పరుగులు పెడుతున్నా దాన్ని చూసి తట్టుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్న టీడీపీ నాయకులు కళ్లున్న కబోదులని మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి ఫైర్ అయ్యారు. టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవరత్నంనాయుడు చేసిన ఆరోపణల్లో జీవం లేదంటూ దుయ్యబట్టారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ పాలనలో పుత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ భవన నిర్మాణాన్ని మార్కెట్ యార్డులో మొదలు పెట్టి లక్షల రూపాయలను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. టిడ్కో ఇళ్ల పేరిట పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసుకుని జేబులు నింపుకున్న టీడీపీ నాయకులు అభివృద్ధి అంటూ మాట్లాడడం సరికాదన్నారు. 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి జోరందుకుందని తెలిపారు. మంత్రి ఆర్కే రోజా సహకారంతో పుత్తూరు పట్టణంలో రూ.185.78 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయని, ఇప్పటికే రూ.25.24 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని వివరించారు. ఇందులో రూ.7.6 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల, రూ.1.10 కోట్లతో మున్సిపల్ పార్కు, రూ.25 లక్షలతో ద్రౌపదీదేవి ఆలయ రాజగోపురం పనులు పూర్తి చేసి మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. అత్యంత ప్రధానమైన రూ.139 కోట్లతో శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలువ నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకుకు పైపులైను పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే రూ.2 కోట్లతో మున్సిపల్ భవన నిర్మాణం, రూ.1.85 కోట్లతో షాదీమహల్, రూ.1.60 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతూ ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతున్నాయని వివరించారు. నాడు–నేడు రెండోవిడతలో రూ.14.94 కోట్లు మంజూరు కాగా 48 స్కూళ్లతో పాటు 2 జూనియర్ కళాశాలల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇన్ని అభివృద్ధి పనులు జరుగుతుంటే అభివృద్ధి అటకెక్కిందంటున్న టీడీపీ నాయకులకు కళ్లు ఉన్నట్టా? లేనట్టా? అంటూ ప్రశ్నించారు.

సర్పాల సయ్యాట


పెనవేసుకుని బుస కొడుతున్న సర్పాలు

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం ప్రకాష్ నగర్ గుబురుగా ఉన్న చెట్ల సమీపంలో ఉన్న ఇంటి బాత్రూంలోకి మూడు పాములు చొరబడడంతో ఆ ఇంట్లో వారితో పాటు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పాములను అక్కడి నుంచి పంపేందుకు వారు ప్రయత్నించగా చెట్ల మధ్యలోకి వెళ్లి రెండు పాములు కలసి పెన వేసుకుని బుస కొట్టడంతో భయాందోళన చెందారు. ఇంటి యజమానులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించగా వారు పుత్తూరు నుంచి స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌ను రప్పించారు. అప్పటికే పాములు బాత్రూంలో నుంచి పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లాయి. వాటిని పట్టుకోవడానికి స్నేక్‌క్యాచర్ తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. అయితే పాములు ఆ ప్రాంతంలోనే అక్కడే సంచరిస్తున్నాయని, తక్షణం పొదలను శుభ్రపరిస్తేనే వాటిని పట్టగలమని స్నేక్ క్యాచర్ మున్సిపల్ అధికారులకు సూచించారు.

అలరించిన దుర్యోధన వధ


వెదురుకుప్పంలో జరిగిన అగ్నిగుండ ప్రవేశానికి విచ్చేసిన అశేష భక్తులు


హోరాహోరీగా తలపడుతున్న భీమ, దుర్యోధనుడి పాత్రధారులు

వెదురుకుప్పం: మండల పరిధిలోని పచ్చికాపల్లంలో నిర్వహిస్తున్న ద్రౌపదీ ధర్మరాజుల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను ఊరేగించారు. అలాగే ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్యోధన వధ ఘట్టంలో భీముడు గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని బయటకు తీసుకొచ్చే సన్నివేశం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. అదేవిధంగా దుర్యోధనుడు ఆలపించిన పద్యాలు పలువురితో కంటతడి పెట్టించాయి. అనంతరం భీముని వేషధారి దుర్యోధనున్ని వధించడంతో కార్యక్రమం ముగిసింది. దుర్యోధన వధ ఘట్టాన్ని భాగవతారిణి విజయకుమారి హరికథా కాలక్షేపం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా బోడిరెడ్డి నరేష్‌రెడ్డి, శ్యామల కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో భాగంగా అగ్నిగుండ ప్రవేశ భక్తులు పూలమాలలు ధరించి, వేపాకులు చేతబట్టి భక్తుల గోవింద నామస్మరణాలతో ఆలయ ఆవరణ మారుమోగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ నిర్వాహకులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గదా యుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. వేంకటేశ్వర నాట్యబృందంలో భీమసేనుడిగా గంగాధర్, దుర్యోధనుడిగా మునిరత్నం కురుక్షేత్ర యుద్ధం ఘట్టాన్ని రక్తి కట్టించారు. సన్నివేశంలో భాగంగా సర్వం కోల్పోయిన దుర్యోధనుడు అస్త్రసన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్లగా.. భీమసేనుడి పాత్రధారి దుర్యోధనున్ని బయటకు రప్పించి, వధించే సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ సన్నివేశాన్ని తిలకించడానికి స్థానిక ప్రజలతో పాటు తమిళనాడుకు చెందిన ప్రజలు వందలాది మందికి పైగా తరలివచ్చారు. సాయంత్రం ధర్మరాజుకు పట్టాభిషేకం, అగ్గితొక్కే కార్యక్రమం జరిగింది.


భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం


పాలసముద్రంలో జరిగిన దుర్యోధన వధ ఘట్టాన్ని, తిలకించడానికి వచ్చిన జనసందోహం

దాతల సాయం అభినందనీయం


మెమెంటోలు అందుకున్న విద్యార్థులు

పుత్తూరు రూరల్: విద్యాభివృద్ధికి తమవంతు సాయం అందిస్తున్న పుత్తూరుకు చెందిన శ్రీ సరస్వతీ మాతా సాంఘిక సేవాసమాజ సభ్యుల సేవలు అభినందనీయమని తిరుపతి జిల్లా డీఈఓ వి.శేఖర్ అన్నారు. ఆదివారం సేవాసమాజం ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ స్కూల్‌లో మండలస్థాయిలో ర్యాంకులు సాధించిన వివిధ పాఠశాలల విద్యార్థులకు, భవిత పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈఓ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ఎంతో ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డీఐఈఓ రఘురామయ్య, ఎంఈఓ తిరుమలరాజు, సేవాసంఘ సభ్యులు పాల్గొన్నారు.